

పూసూరు వద్ద కొత్త నీటితో ప్రవహిస్తున్న గోదావరి

## గోదావరికి జలకళ

వరద నీటితో గోదావరి జలకళ సంతరించుకుంది. పేరూరు, వాజేడు, పూసూరు, ఎడ్జర్లపల్లి మీదుగా ప్రవహిస్తున్న నదిని చూసేందుకు ప్రయాణికులు పూసూరు బ్రిడ్జి వద్ద ఆగి ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. మొన్నటివరకు నీళ్లు లేక బోసిపోయిన గోదావరిలోకి మళ్లీ కొత్త నీరు చేరడంతో కళకళలాడుతోంది.

*– వాజేడు, జూన్ 8*

## లక్ష్మీనగర్‌లో తాత్కాలిక బస్టాండ్

ములుగు, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలో ఆర్టీసీ మోడల్ బస్టాండ్ నిర్మాణ పనులకు మంత్రులు గత నెలలో శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరు నెలల్లో బస్టాండ్ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ బస్టాండ్ నిర్మాణ పనులు ఒక్కొక్కటిగా చేపట్టి పాలకేంద్రం భవనాన్ని తొలగించి భూమి చదును చేయించారు. ప్రస్తుతం కొనసాగుతున్న బస్టాండ్‌ను కూల్చేసి దాని స్థానంలో మోడల్ బస్టాండ్ నిర్మాణ పనులను చేపట్టాల్సి ఉంది. ఇందుకు ఆర్టీసీ బస్సులకు, ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడకుండా కలెక్టర్ ఆదేశాలతో ఆర్టీసీ అధికారులు తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. జాతీయ రహదారిని ఆనుకొని లక్ష్మీనగర్‌లో ఉన్న అయ్యగార్లకు చెందిన ఇనామ్ భూమిలో తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు చేస్తున్నారు. కాగా, రెండు రోజులుగా ఆ స్థలంలో మొరం పోయిస్తున్నారు. తాత్కాలిక బస్టాండ్‌ను అందుబాటులోకి తెచ్చి జాతీయ రహదారిపై తాత్కాలికంగా డివైడర్‌ను తొలగించి యూటర్న్ పాయింట్ ఏర్పాటు చేసి బస్సుల రాకపోకలకు ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టనున్నారు.


లక్ష్మీనగర్‌లోని తాత్కాలిక బస్టాండ్ స్థలంలో పోసిన మొరం

# అంగడితో రాకపోకలకు అడ్డంకులు

- ప్రజలకు సౌకర్యంగా ఉన్నప్పటికీ ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు
- ప్రత్యామ్నాయం చూడకపోతే అంగడి నిర్వహణ కష్టమే
- ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి

ములుగు, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : ప్రజల కనీస సౌకర్యాల కోసం, గ్రామపంచాయతీ ఆదాయాన్ని పెంచేందుకు 2022లో ములుగు గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో అప్పటి పాలకవర్గ సభ్యులు ప్రతి ఆదివారం అంగడి నిర్వహించాలని తీర్మానం చేశారు. అప్పటి నుంచి ప్రతి ఆదివారం జీపీ కార్యాలయం ఎదురుగా ఉన్న కూడళ్లలో అంగడి కొనసాగిస్తున్నారు. ఈ అంగడి ద్వారా జీపీకి ఆదాయం లభించడంతోపాటు రైతులకు, వ్యాపారులకు లాభసాటిగా, ప్రజలకు మేలుదాయకంగా మా రుతూ వస్తుంది. అయితే వారంవారం జరిగే అంగడిలో ప్రజల రద్దీ అప్పటి కంటే ఇప్పుడు ఎక్కువగా పెరిగిపోయింది. అంగడికి చేరుకునే దారులన్నీ ఆదివారం బ్లాక్ అవుతున్నాయి. విక్రయదారులు రోడ్లకు ఇరువైపులా విక్రయాలు చేస్తుండగా వాటిని కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలు వాహనాలను అంగడి వెంట ఉన్న దారులలో పా ర్కింగ్ చేస్తున్నారు. దీంతో ఇటు అంగడికి వచ్చే వారితోపాటు కాలనీవాసులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నా యి. దీనికితోడు నాటి జీపీ సమయంలో, ప్రస్తుతం ము న్సిపాలిటీ ఆధ్వర్యంలో నాలుగు ప్రధాన కూడళ్లలో బారికేడ్లు ఏర్పాటు చేసి ద్విచక్రవాహనాలను వెళ్లనివ్వడం లే దు. దీంతో కాలనీవాసులు ఇండ్లకు చేరుకునేందుకు అవస్థలు పడుతున్నారు. కిలోమీటర్ మేరా చుట్టూ తిరిగి చిన్నచిన్న గల్లీల నుంచి ఇండ్లకు చేరుతున్నారు. అత్యవసర సమయంలో కాలనీవాసులు బయటకు రావాల్సిన పరిస్థితి లేదంటున్నారు. అధికారులు అంగడి నిర్వహణను చేపట్టడం ప్రజల మంచికే అయినప్పటికీ నిర్వహించే తీరుతో కాలనీ వాసులకు అసౌకర్యంగా మారుతున్నది.


అంగడి ప్రాంతంలో కాలనీకి వెళ్లే రోడ్డులు రద్దీగా ఉన్న దృశ్యం


కాలనీవాసుల వాహనాలు వెళ్లకుండా ఏర్పాటు చేసిన బారికేడ్లు

### ప్రత్యామ్నాయం చూడకపోతే అంగడి నిర్వహణ కష్టమే..

ప్రతి ఆదివారం అంగడిని గ్రంథాలయం పక్కన ఉన్న రైతు బజార్‌లో నిర్వహించాలని అప్పటి పాలకవర్గం నిర్ణయం తీసుకున్నది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 2018లో రూ.50లక్షలతో మోడల్ రైతు బజార్‌ను ప్రస్తుతం అంగడి జరుగుతున్న ప్రాంతంలో నిర్మించారు. రైతులు పండించిన కూరగాయాలను స్వయంగా విక్రయించుకునేందుకు రైతు బజార్‌లో షెడ్‌లతోపాటు రోడ్డు వైపు ఆరు షెటర్లను రైతులు కూరగాయాలు నిలువ చేసుకునేందుకు నిర్మించారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగిన రైతు బజార్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మార్కెట్ కమిటీ నుంచి జీపీ ఆధ్వర్యంలోకి బదలాయించారు. గాంధీ పార్క్ వద్ద ఉన్న కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులకు రైతు బజార్‌లోని షెడ్లను కేటాయించారు. అయితే ఆదివారం నిర్వహించే అంగడి రైతు బజార్ ప్రహరి లోపల నిర్వహించాల్సి ఉండగా వ్యాపారులు, రైతులు పోటీలు పడి రోడ్ల వెంబడి దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. నియంత్రించాల్సిన అధికారులు దగ్గరుండి రోడ్లను మూసి వేసి వ్యాపారులకు సహకరిస్తున్నారు. దీని కారణంగా అంగడి జరిగే ప్రాంతంలోని గృహనివాసులు బయటకు వెళ్లాలన్నా, బయట నుంచి ఇంటికి చేరుకోవాలన్నా నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ములుగు గ్రామపంచాయతీ మున్సిపాలిటీగా మారగా అంగడి నిర్వహణను అధికారులు ఇప్పటికైనా రైతు బజార్ ప్రహరి లోపల కానీ, ప్రత్యామ్నాయ స్థలంలో కానీ నిర్వహించనట్లయితే కాలనీవాసుల ఆగ్రహంతో అంగడి నిర్వహణ కష్టతరంగా మారనున్నది. ఇప్పటికే కొందరు అంగడి నిర్వహణపై చట్ట ప్రకారం పోరాటం చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

## లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

టేకుమట్ల/గోవిందరావుపేట, జూన్ 8 : ఈనెల 9 నుంచి 14 వరకు జరిగే లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై సుధాకర్ తెలిపారు. మండలంలో ప్రజలు ఏవైనా చిన్న చిన్న కేసులు (కొట్టుకున్న, చిన్న దొంగతనాలు, భార్యాభర్తల గొడవ, రోడ్ యాక్సిడెంట్, చీటింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, పెట్టీ, గేమింగ్ యాక్ట్, భూమికి సంబంధించిన కేసులు) ఉంటే ఈ లోక్‌అదాలత్‌కు ఉదయం 9గంటలకు హాజరై రాజీ చేసుకోవాలని, లేదా ఫైన్ కట్టుకొని కేసు తొలగించుకోవాలని తెలిపారు. హాజరయ్యేవారు ఆధార్‌కార్డు ఫొటో, ఫైన్ డబ్బులు తీసుకెళ్లాలని సూచించారు. పూర్తి వివరాలకు కోర్టు కానిస్టేబుల్ చంద్రకళ 9502925531, ఎస్సై సుధాకర్ 8712658125, పీఎస్ టేకుమట్ల 8712658146ను సంప్రదించాలని సూచించారు. కాగా, ఈనెల 14వ తేదీన జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పస్రా ఎస్సై కమలాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పలు కేసులను రాజీ పడాలనుకునే వారు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అదుపు తప్పి బైక్ బోల్తా.. ముగ్గురికి గాయాలు

మహదేవపూర్, జూన్ 8 : బైకు అదుపుతప్పి ఒకరికి తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలైన ఘటన మండలంలోని కొత్త బ్రాహ్మణపల్లి ప్రధాన రహదారిపై ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన చెన్నూరి కార్తీక్ ఆజంనగర్‌కు చెందిన స్నేహితులు కిరణ్, మహేశ్‌తో కలిసి బైక్‌పై సూరారం నుంచి మహదేవపూర్‌కు వస్తున్నారు. కొత్త బ్రాహ్మణపల్లి క్రాస్ వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో బైక్‌పై వెళ్తున్న చెన్నూరి కార్తీక్ చెవు, ముక్కు భాగంలో తీవ్రగాయాలు కాగా, కిరణ్ మహేశ్‌కు స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కార్తీక్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం భూపాలపల్లి 100 పడకల దవాఖానకు తరలించారు.


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

## మద్దులపల్లిలో మూడు గడ్డివాముల దగ్ధం

కాటారం, జూన్ 8 : మండలంలోని మద్దులపల్లిలో ఆదివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు రైతులు గుండపు పోచయ్య, గుండపు రాజయ్య, గుండపు లక్ష్మయ్యకు చెందిన మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఇళ్ల వెనుక పశుల కోసం వరిగడ్డి నిల్వ చేసుకోగా పక్కనున్న చేలల్లో చెత్తాచెదారానికి నిప్పటించగా గాలికి నిప్పురవ్వలు ఎగిరి గడ్డివాముపై పడ్డాయి. దీంతో మూడు గడ్డివాములకు మంటలు అంటుకొని కాలిపోయాయి. చుట్టుపక్కలవారు కేకలు వేయడంతో బాధితులు, గ్రామస్తులు ఫైరింజన్‌కు సమాచారం ఇచ్చి మంటలు ఆర్పే చర్యలు చేపట్టారు. భూపాలపల్లి నుంచి ఫైరింజన్ రాగా సిబ్బంది మంటలను పూర్తిగా ఆర్పేశారు. అప్పటికే వరి గడ్డి అంతా కాలిపోయింది. సుమారు రూ.60వేల నష్టం జరిగిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రగళ్లపల్లిలో ఘనంగా ఎల్లనంపుడు పండుగ

వాజేడు, జూన్ 8 : మండలంలోని ప్రగళ్లపల్లిలో ఆదివారం గ్రామస్తులు ఎల్లనంపుడు పండుగ నిర్వహించారు. గ్రామంలో చెక్కలబండి తయారుచేసి ముత్యాలమ్మ వారికి కోళ్లు, మేక, పప్పు ప్రసాదాలు నైవేద్యంగా పెట్టి పూజలు చేశారు. గ్రామ పొలిమేరలో రహదారికి ఇరువైపులా బురక కర్రలు పాతి, వాటికి మామిడి తోరణాలు కట్టి పూజలు చేశారు. అనంతరం పొలాల్లో దుక్కులు దున్నుకొని విత్తనాలు చల్లే కార్యక్రమానికి శ్రీకారం చుడుతారు. తమ పూర్వీకుల నుంచి ఈ ఆచార, సంప్రదాయం కొనసాగుతోందని, ఇలా చేయడం వల్ల గ్రామంలో ఎలాంటి చెడు ఘటనలు జరగవని గ్రామస్తుల నమ్మకం.


గ్రామశివారులో మొక్కుతున్న గ్రామస్తులు

## మృతుడి కుటుంబానికి పరామర్శ

ఏటూరునాగారం, జూన్ 8 : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు వావిలాల కొంరయ్య కుటుంబాన్ని పార్టీ నాయకులు సోమవారం పరామర్శించారు. కొంరయ్య తల్లి వెంకటమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకులు కొంరయ్య కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఖాజాపాషా, కుమ్మరి చంద్రబాబు, గండపెల్లి నర్సయ్య, కాళ్ల రామకృష్ణ, దేపాక శ్రీరాం, వావిలాల కిశోర్, నర్సింగారావు, ముత్తయ్య పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


పరామర్శిస్తున్న పుట్ట మధు


## బాధిత కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

కాటారం, జూన్ 8 : మండలంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం రాత్రి పర్యటించి పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. గంగారంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో, అనారోగ్యంతో మృతిచెందిన మారపాక మధునమ్మ, చిట్యాల దుర్గయ్య, నీలాల బాలయ్య కుటుంబాలను మధు పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు ఊర వెంకటేశ్వర్‌రావు, మందల లక్ష్మారెడ్డి, ఉప్పు సంతోష్, కొండపర్తి రవి, గాజుల విక్రమ్, సమ్మయ్య, శ్రీలక్ష్మిదరి, నాగమణి ఉన్నారు.


మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాల మహానాడు నాయకులు

## మృతుల కుటుంబాలకు పరామర్శ

కాటారం, జూన్ 8 : మేడిగడ్డ ప్రాజెక్టులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతిచెందిన వారి పలు కుటుంబాలను ఆదివారం మాల మహానాడు నాయకులు పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. విషాదకర ఘటన జరిగి రెండు రోజులు కావస్తున్నా అధికార పార్టీ నాయకులు మాత్రం ఇప్పటి వరకు మృతుల కుటుంబాలను కలవకపోవడం విచారకరమన్నారు. ప్రమాదవశాత్తు చనిపోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా సత్వరమే చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు వద్ద సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో మహానాడు నాయకులు కందుగుల రాజన్న, జిల్లా మాజీ అధ్యక్షుడు పసుల అశోక్, కాళేశ్వరం మాజీ డైరెక్టర్ బండి రాజన్న, బోడ బాపు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న పదోతరగతి మిత్రులు

## మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

మొగుళ్లపల్లి, జూన్ 8 : చిన్ననాటి మిత్రుడు అకాల మరణం చెందగా తోటి స్నేహితులు ఆపన్నహస్తం అందించారు. బంగ్లాపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కరాబ్ రజిత భర్త కరాబ్ యువరాజ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న 1990–91 పదో తరగతి మిత్ర బృందం తమ స్నేహితుడు కుటుంబానికి రూ.32వేలను ఆదివారం ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు పెంతల ప్రకాశ్‌రెడ్డి, తక్కళ్లపల్లి వెంకన్న, లింగంపల్లి వెంగళరావు, మాల్సాని రాజేశ్వరరావు, బద్ధం మోహన్, ఎరుకల మాధవ్, కందుల రమేశ్, బత్తిని రమేశ్ గౌడ్, మాటూరు శ్రీనివాస్, కల్లెపల్లి సాంబయ్య, తిప్పారపు సాంబయ్య పాల్గొన్నారు.


చిట్యాల: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

చిట్యాల, జూన్ 8 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 21ఏళ్ల తర్వాత కలుసుకోగా ఒకరినొకరు పలకరించుకొని, నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు గురువులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ఫొటోలు దిగి ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థులు పెరుమాండ్ల రాజు, తూటిచర్ల రాజేందర్, చిక్కుల నరేశ్, ఏలేటి రాజు, బుర్ర సతీశ్, చింతల చిరంజీవి, రమణాచారి, కవిత, భవాని, మమత, మిత్ర బృందం పాల్గొన్నారు.


మొగుళ్లపల్లి: పూర్వ విద్యార్థుల మిత్ర బృందం


గణపురం: పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

### అకినపల్లిలో..

మొగుళ్లపల్లి: మండలంలోని అకినపల్లి ఉన్నత పాఠశాలలో 1992–93 చదువుకున్న పదో తరగతి పూర్వ విద్యార్థులు జమ్మికుంట పట్టణంలోని పద్మశాలి భవనంలో ఆదివారం పూర్వ విద్యార్థులు శ్రీనివాస్, కవిత ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ అధ్యాపక బృందం సమ్మ య్య, జీవన్‌రావు, వెంకటేశ్వరరావు, చారి, కుమారస్వామి, రాజయ్యను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు పింగిలి వెంకటేశ్వర్‌రెడ్డి, వంగ కుమారస్వామి, సతీశ్‌రెడ్డి, మోహన్, బేరగోని మహేందర్, కూరపాటి రవీందర్, కొండి రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, రాజయ్య, రాజేందర్, రమేశ్ పాల్గొన్నారు.

### చెల్పూరులో..

గణపురం : మండలంలోని చెల్పూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2005–2006 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. వారంతా ఒక్కచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాలకు విద్యార్థులు కూర్చునే బెంచీలను ప్రదానం చేశారు. పూర్వ విద్యార్థులు చుక్క రాజు, సముద్రాల నరేశ్, కీర్తి రాజు, బీరెల్లి సురేశ్, సీహెచ్ వేణు, కవిత, ముంతాజ్ పాల్గొన్నారు.

# అనర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

- ఎకరాలకొద్దీ ఉన్నా అర్హులేనట
- నిరుపేదలకు మొండిచేయి
- చానళ్లపై కేసులు పెట్టడం దుర్మార్గపు చర్య
- మాజీ జడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి

తాడ్వాయి, జూన్ 8: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల కోసం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అవకతవకలకు పాల్పడి ఏ ఒక్క నిరుపేదకు కూడా కేటాయించలేదని మాజీ జడ్పీటీసీ, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని కాటాపురంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేదల కోసం మంజూరు చేసిన ఇళ్లను పది ఎకరాలు, ఐదు ఎకరాలు భూమి కలిగి ఉన్నవాళ్లకు ఇళ్లను మంజూరు చేసి అర్హులైన వారికి తీరని అన్యాయం చేశారని అన్నారు. ఇళ్ల ఎంపికపై సర్వే నిర్వహించి నిరుపేదలకు ఇళ్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండే పత్రికలు చానళ్లపై కేసులు నమోదు చేయడం కాంగ్రెస్ నాయకుల దుర్మార్గమైన చర్య అని అన్నారు. రాజీవ్ యువశక్తి ఎంపికలోనూ అర్హులైన నిరుపేదలను ఎంపిక చేయాలని, పార్టీ కార్యకర్తలను ఎంపిక చేయడం సరైంది కాదన్నారు. మేడారంలో కాంగ్రెస్ నాయకులు ఇసుక దందా నడిపిస్తూ దోచుకుంటున్నారని ఆరోపించారు. ఆయన వెంట నాయకులు మోహన్‌రావు, రమేశ్, గౌరమ్మ, చంద్రం, సత్యం, సయ్యద్ హుస్సేన్, శ్రీకాంత్, కృష్ణ ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

## ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు

మంగపేట, జూన్ 8 : మండలంలోని చెరుపల్లి గ్రామాల్లో ఆదివారం బొడ్రాయి, భూలక్ష్మి, మహాలక్ష్మి సహిత ముత్యాలమ్మ, మైసమ్మ, గంగమ్మ, నాగులమ్మ, ఎర్రమ్మ, శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిద్ధాంతులు చిట్టోజు రామాచారి, గాదె నరేశ్ ఆచార్యుల బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామ దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠాపన అనంతరం హైకోర్టు అడ్వకేట్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. వేడుకల్లో గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



## 'మాగంటి' మృతి పార్టీకి తీరని లోటు

వెంకటాపురం(నూగూరు), జూన్ 8 : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటు అని మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, జిల్లా నాయకులు గుడవర్తి నర్సింహమూర్తి అన్నారు. ఆదివారం ఆయనకు సంతాపం వ్యక్తం చేసి ఆయన సేవలను కొనియాడారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.

NT-325336

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## నాంపల్లిలో ములుగు జిల్లా వాసి మృతి

ములుగు రూరల్, జూన్ 8 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి లక్ష్మీనర్సింహాస్వామి గుట్టపైనున్న కోనేరులో పడి ములుగు జిల్లా వాసి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా ముల్లంపల్లి మండలం భూపాల్‌నగర్ (పందికుంట)కు చెందిన సాదం సమ్మయ్యకు ముగ్గురు కుమారులు. రెండో కుమారుడు సాదం రాజు (32) వరంగల్ జిల్లా కాకతీయ విశ్వవిద్యాలయంలో పీజీ, ఎంఈడీ పూర్తి చేసి ప్రభుత్వ కొలువుల కోసం ప్రిపేర్ అవుతున్నాడు. తిరుపతి, వేములవాడ దైవదర్శనాల కోసం వెళ్లి వస్తానని ఈ నెల 5 ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయల్దేరాడు. ఆదివారం ఉదయం 5.30లకు రాజు బంధువైన జక్కుల మహేందర్ వేములవాడ దైవదర్శనానికి వచ్చి రాజుకు కాల్ చేయగా రాజు లిఫ్ట్ చేయలేదు. దీంతో రాత్రి జుక్కుల మహేందర్‌తో రాజు ఉదయం నాంపెల్లి గుట్ట పైనున్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వెళ్తానని చెప్పిన్నట్లు పేర్కొన్నారు. రాజు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో నాంపెల్లి గుట్టపై వెతికగా పక్కనున్న కోనేరులో రాజుకు చెందిన బ్యాగు, చెప్పులు, పర్సు లభించడంతో అనుమానంతో కోనేరులో పడి ఉంటాడని వెతికే ప్రయత్నం చేయగా రాజు డెడ్‌బాడీ లభించింది. వేములవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం కోసం బాడీని ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. మృతికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు.


రాజు(ఫైల్)

# మృగశిర సందడి

- చేపలకు భలే గిరాకీ
- కిలోకు రూ.250 నుంచి రూ.300 చొప్పున విక్రయాలు

ములుగురూరల్/వెంకటాపురం(నూగూరు)/వాజేడు/ఏటూరునాగారం/కాటారం/గణపురం/గోవిందరావుపేట, జూన్ 8 : మృగశిర అనగానే గుర్తుకు వచ్చేది చేపలు. ఈ కార్తె ఆరంభరోజు చేపలు తినడం ఆనవాయితీగా వస్తుంది. మృగశిర కార్తెతో వర్షాకాలం ఆరంభమైందని అంటారు. కార్తె రోజున చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని పెద్దలు చెబుతుంటారు. ముఖ్యంగా ఉబ్బసం, ఆయాసం ఉన్న వారితోపాటు పెరిగిన సమతుల్యం, హృదయ సంబంధిత వ్యాధుల నివారణకు ఈ చేపలు ఎంతో మంచివి. రోహిణి కార్తెలో వేడెక్కిన శరీరం చల్లబడేందుకు పోషక విలువలు పొందేందుకు, చేపలు తినాలనేది ఆనవాయితీగా వస్తుంది. ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఆదివారం మృగశిర కార్తె సందర్భంగా చేపల కొనుగోళ్లకు డిమాండ్ ఏర్పడింది. సాధారణ రోజుల్లో రూ.150పలికిన చేపలు ప్రస్తుతం మృగశిర కార్తె రోజు రూ.250 చొప్పున విక్రయాలు జరిపారు. ప్రజల తాకిడి ఎక్కువ కావడంతో కొన్ని చోట్ల రూ.300లకు పెంచి విక్రయాలు జరిపారు. రేటు సైతం లెక్కచేయకుండా ప్రజలు చేపలు కొనేందుకు పోటీపడ్డారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు చేపల విక్రయాలు జోరుగా సాగాయి. ప్రజలు అధిక సంఖ్యలో చేపలు కొనుగోలు చేయడంతో టన్నుల్లో విక్రయాలు జరుగగా మత్స్యకారులకు ఈ మృగశిర కార్తె లాభదాయకంగా మారింది. వాజేడు మండలంలోని పూసూరు గోదావరి వద్దకు పెద్దఎత్తున వాజేడు, వెంకటాపురం మండలాలకు చెందిన ప్రజలు తరలివచ్చి కేజీ చేపలకు రూ.200లు ధర చెల్లించి కొనుగోలు చేశారు.


వాజేడు : పూసూరు గోదావరి వద్ద చేపలు కొనుగోలు


వెంకటాపురం(నూగూరు): చేపల విక్రయం


ఏటూరునాగారం: చేపల మార్కెట్‌లో సందడి


గణపురం: మార్కెట్‌లో కొనుగోలుదారుల సందడి


ములుగు రూరల్: చేపలు విక్రయిస్తున్న వ్యాపారులు